ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
Bullet
Edition
ఆదివారం 16 నవంబరు www.prajaswaramdaily.com 2 pm

ఐబొమ్మ, బప్పం టీవీ వెబ్‌సైట్లు క్లోజ్

ఇమ్మడి రవితోనే క్లోజ్ చేయించిన పోలీసులు

హైదరాబాద్ : ఐబొమ్మ నిర్వాహకుడు ఇమ్మడి రవితోనే పైరసీ సినిమాలకు వేదికగా మారిన ఐబొమ్మ, బప్పం టీవీ వెబ్‌సైట్లను క్లోజ్ చేయించి, వెబ్ లాగిన్స్, సర్వర్ వివరాలతో మూసివేశారు. 'నా వద్ద కోట్ల మంది డేటా ఉంది. ఈ వెబ్‌సైట్ మీద ఫోకస్ చేయటం ఆపండి' అంటూ గతంలో అతడు పోలీసులకు సవాల్ విసిరినట్లు సామాజిక మాధ్యమాల్లో ఓ లేఖ చక్కర్లు కొట్టింది. దీంతో ఆ సవాల్‌ను స్వీకరించిన పోలీసులు ముందుగా ఐబొమ్మలోని కొందరిని అరెస్టు చేశారు. ఈ క్రమంలో విదేశాల నుంచి వచ్చిన ఇమ్మడి రవితోనే పోలీసులు ఆయా వైబ్‌సైట్లను క్లోజ్ చేయించడం గమనార్హం. ఇమ్మడి రవి వద్ద స్వాధీనం చేసుకున్న వందల హార్డ్ డిస్క్‌లను పోలీసులు విశ్లేషణ చేస్తున్నారు. నిందితుడి బ్యాంక్ ఖాతాల వివరాలను పరిశీలిస్తున్నారు. అతడిని కస్టడీలోకి తీసుకుని మరికొన్ని వివరాలు సేకరించాలని పోలీసులు భావిస్తున్నారు. సోమవారం నాంపల్లి కోర్టులో కస్టడీ పిటిషన్‌ను పోలీసులు దాఖలు చేయనున్నారు.

19 లేదా 20న కొలువుదీరనున్న ఎన్డీయే కొత్త ప్రభుత్వం

మరోసారి సీఎంగా నీతీశ్.. ప్రమాణం

బిహార్: ఎన్నికల ఫలితాల్లో ఎన్డీయే విజయం సాధించడంతో కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు కూటమి నేతలు చర్యలు చేపట్టారు. మరోసారి బిహార్ ముఖ్యమంత్రిగా నీతీశ్ కుమార్ కొనసాగుతారని వారు పేర్కొన్నారు. నవంబర్ 19 లేదా 20 తేదీలలో కొత్త ప్రభుత్వం కొలువు తీరే అవకాశం ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు హాజరయ్యే అవకాశం ఉంది. ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార కార్యక్రమం కోసం ఇందుకు పట్నాలోని గాంధీ మైదానం లో ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. బిహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను ఎన్నికల సంఘం ఆదివారం గవర్నర్ రాజేంద్ర అర్లేకర్‌కు సమర్పించనుందని.. ఆ తర్వాత కొత్త అసెంబ్లీ ఏర్పాటుకు నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ప్రమాణ-స్వీకారానికి 19 లేదా 20లలో ఏ తేదీని నిర్ణయిస్తారనే విషయం ప్రధాని నరేంద్ర మోదీ షెడ్యూల్‌పై ఆధారపడి ఉంటుందని తెలిపారు. సోమవారం జరగనున్న మంత్రివర్గ సమావేశంలో అసెంబ్లీ రద్దుకు ఆమోదం తెలిపే అవకాశమున్నట్లు తెలుస్తోంది. ఈ తీర్మానాన్ని ఆమోదించిన తర్వాత నీతీశ్ తన రాజీనామాను గవర్నర్‌కు సమర్పిస్తారు. తద్వారా కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు చర్యలు ప్రారంభమవుతాయి.

హైదరాబాద్‌లో రెచ్చిపోయిన నేపాలీ గ్యాంగ్

గన్‌రాక్ ఎన్‌క్లేవ్‌లో భారీ దోపిడీ

ఇంట్లో పనిచేస్తున్న నేపాలీ వ్యక్తి ఘాతుకం

మరో నలుగురితో కలిసి యజమానిపై దాడి

యజమానిని కట్టేసి రూ.50 లక్షల సొత్తు దోచుకున్న నేపాల్ ముఠా

(హైదరాబాద్)

కారా□నా పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ దోపిడీ జరిగింది. గన్‌రాక్ ఎన్‌క్లేవ్‌లో నివసిస్తున్న కెప్టెన్ గిరి (75) ఇంట్లో ఈ ఘటన చోటుచేసుకుంది. ఇంట్లో పనిచేసే నేపాల్‌కు చెందిన వ్యక్తే మరో నలుగురితో కలిసి ఈ దోపిడీకి పాల్పడినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. కెప్టెన్ గిరి ఇంట్లో పనిచేస్తున్న నేపాలీ వ్యక్తి, పథకం ప్రకారం మరో నలుగురిని ఇంట్లోకి తీసుకువచ్చాడు. అనంతరం ముఠా సభ్యులు గిరిపై కర్రలతో దాడి చేసి, ఆయన్ను కట్టేశారు. ఆ తర్వాత ఇంట్లోని బీరువాను పగులగొట్టి సుమారు రూ.50 లక్షల విలువైన సొత్తును దోచుకెళ్లారు. 25 తులాలకు పైగా బంగారం, రూ. 23 లక్షల నగదును దుండగులు అపహరించినట్లు బాధితుడి కుటుంబసభ్యులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. సమాచారం అందుకున్న కారా□నా పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఇంట్లో పనిచేసే వ్యక్తి వివరాల ఆధారంగా దర్యాప్తు ముమ్మరం చేశారు.

కరీంనగర్‌లో అమానుషం

కూతురిని హత్య చేసిన తండ్రి

కుమారుడిని సైతం చంపేందుకు విఫలయత్నం

దివ్యాంగులు కావడమే కారణం

కరీంనగర్: వావిలాల పల్లిలో అమానవీయ ఘటన జరిగింది. . కూతురు, కుమారుడికి అంగవైకల్యం కారణంగా ఉరి వేసి చంపేందుకు తండ్రి మల్లేశం యత్నం చేశాడు. కూతురు అర్చనకు ఉరివేసి హత్య చేశాడు. ఇదే సమయంలో కుమారుడు ఆశ్రిత్ కు ఉరి వేసే సమయంలో భార్య రావడంతో మల్లేశం పరారయ్యాడు. నిందితుడి కోసం పోలీసుల గాలిస్తున్నారు.

రామోజీ ఫిల్మ్ సిటీకి ఉపరాష్ట్రపతి రాక

హాజరుకానున్న తెలుగు రాష్ట్రాల సీఎంలు , కేంద్రమంత్రి, సుప్రీం సీజేఐ

'రామోజీ ఎక్స్‌లెన్స్-2025 అవార్డుల ప్రదానోత్సవం

హైదరాబాద్: 'రామోజీ ఎక్స్‌లెన్స్-2025 అవార్డుల ప్రదానోత్సవం సాయంత్రం 5.30 గంటలకు రామోజీఫిల్మ్ సిటీలో జరగనుంది. ఈ పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమానికి భారత ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. గౌరవ అతిథులుగా తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, రామ్మోహన్‌నాయుడు, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వీ రమణ తదితరులు పాల్గొననున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా రామోజీ నిఘంటువులను విడుదల చేయనున్నారు.

ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో క్రిమీలేయర్ విధానం

ఇది నా అభిప్రాయం

సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్

అమరావతి : ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలోనూ క్రిమీలేయర్ విధానం ఉండాలన్నది నా అభిప్రాయం అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ అన్నారు. ప్రాథమిక హక్కులకు భంగం కలిగితే కోర్టులను ఆశ్రయించే హక్కు రాజ్యాంగం కల్పించిందని అన్నారు. భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఏపీ హైకోర్టు న్యాయవాదుల ఆధ్వర్యంలో ఆంధ్ర రాష్ట్రం మంగళగిరిలో కార్యక్రమం నిర్వహించారు. "సాంఘిక ఆర్థిక న్యాయ సాధన కోసం రాజ్యాంగంలో ఆదేశిక సూత్రాలను పొందుపరిచారు. రాజ్యాంగాన్ని రాజ్యాంగ సభకు అప్పగిస్తూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చేసిన ప్రసంగం.. ప్రతి న్యాయవాదికి కంఠోపాఠం కావాలి. రాజ్యాంగాన్ని అంబేద్కర్ ఓ స్థిర పత్రంగా చూడలేదు. కాలానుగుణంగా మార్పులు అవసరమనే భావించారు. అంశం ప్రాధాన్యతను బట్టి సవరణ విధానాలను పొందుపరిచారు అని అన్నారు. కొన్ని అంశాల్లో సవరణ సులభం.. కొన్ని అంశాల్లో చాలా కఠినం. రాజ్యాంగం అమల్లోకి వచ్చిన మరుసటి ఏడాదే రిజర్వేషన్ల అంశంపై మొదటి సవరణ చేసుకున్నాం. రాజ్యాంగ సవరణ అంశంపై కేంద్రానికి, సుప్రీంకోర్టుకు మొదట్లో కొంత ఘర్షణ వాతావరణం ఏర్పడింది. కేశవానంద భారతి కేసులో రాజ్యాంగం మౌలిక స్వరూపాన్ని సవరించరాదని సుప్రీంకోర్టు చెప్పింది. 1975 వరకు ఆదేశిక సూత్రాల కంటే ప్రాథమిక హక్కులకే ఎక్కువ ప్రాధాన్యత ఉండేది. కేశవానంద భారతి కేసు తర్వాత ప్రాథమిక హక్కులతో పాటు ఆదేశిక సూత్రాలకూ సమ ప్రాధాన్యం దక్కింది అని ఆయన అన్నారు. కొన్నేళ్లుగా మహిళలు న్యాయ విద్యలో బాగా రాణిస్తున్నారని, రాజ్యాంగం కల్పించిన హక్కుల పట్ల ప్రజలకు అవగాహన ఉండాలి" అని గవాయ్ అన్నారు.

కోల్‌కతా టెస్టులో భారత్ ఓటమి

స్పోర్ట్స్ : ఈడెన్ గార్డెన్స్ వేదికగా దక్షిణాఫ్రికాతో జరిగిన తొలి టెస్టులో భారత్ 30 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. 124 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన టీమ్‌ఇండియా 93 పరుగులకు పరిమితమైంది. సైమన్ హార్మర్ (4/21), మార్కో యాన్సెన్ (2/15), కేశవ్ మహరాజ్ (2/37) టీమ్‌ఇండియా పతనాన్ని శాసించారు. తొలి ఇన్నింగ్స్‌లో సౌతాఫ్రికా 159, సెకండ్ ఇన్నింగ్స్‌లో 153 పరుగులు చేసింది. టీమ్‌ఇండియా ఫస్ట్ ఇన్నింగ్స్‌లో 189, రెండో ఇన్నింగ్స్‌లో 93 రన్స్ చేసింది.

డెఫ్లంపిక్స్‌లో హైదరాబాద్ షూటర్‌కి స్వర్ణం

టోక్యో : టోక్యో వేదికగా జరుగుతున్న డెఫ్లంపిక్స్‌లో హైదరాబాద్‌కు చెందిన షూటర్ ధనుష్ శ్రీకాంత్ ప్రతిభా చూపాడు. 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ పురుషుల విభాగంలో స్వర్ణం సాధించాడు. సూరత్‌కు చెందిన మరో షూటర్ మహ్మద్ వానియా రజత పతకం సొంతం చేసుకున్నాడు. దీంతో రెండు పతకాలూ భారత్‌కే దక్కాయి.

21న రాష్ట్రపతి ముర్ము పర్యటన

(హైదరాబాద్)

ఈ నెల 21 హైదరాబాద్‌కు రాష్ట్రపతి ముర్ము రానున్నారు. ఇదే రోజూ మధ్యాహ్నం రాజ్‌భవన్‌కు రాష్ట్రపతి ముర్ము చేరుకుంటారు. సాయంత్రం బొల్లారంలో జరిగే భారతీయ కళా మహోత్సవంలో పాల్గొంటారు. 22న బేగంపేట ఎయిర్‌పోర్ట్ నుంచి పుట్టపర్తికి వెళ్తారు.ఈ పర్యటన నేపథ్యంలో రాష్ట్రపతి రాక సందర్భంగా భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. రాష్ట్రపతి పాల్గొనే అన్ని కార్యక్రమాల వద్ద ఇప్పటికే కేంద్ర బలగాలు తనిఖీలు నిర్వహించాయి.